# నిజం

కామేశ్వరరావు చెప్పిన విషయం విని నేను చాల ఆశ్చర్యపోయాను. నేను ఊహించినదానికి పూర్తి విరుద్ధంగా ఉంది అతను చెప్పిన విషయం.

"నిజమేనోయ్... విమలమీద నాకు అటువంటి అభిప్రాయం అసలెప్పుడూ లేదు..." అంటూ చెప్పడం ముగించాడు.

విమలా కామేశ్వరరావులు మంచి స్నేహితుల క్రిందే చెప్పుకోవచ్చు. వాళ్ళ పరిచయం ఎప్పుడు ఎక్కడ జరిగిందో తెలియదుగానీ వాళ్ళలో ఒకళ్ళంటే మరొకరికి అభిమానం ఉందనిమాత్రం తెలుసు. బహుశా ఆఫీసులో పనిచేస్తూ చేస్తూనే పరిచయం ఏర్పడి, తరువాత స్నేహంగా మారి ఉంటుందని నా ఊహ! కామేశ్వరరావు నేనుండే సెక్షనులోనే పనిచేస్తున్నాడు. విమల వేరే సెక్షనులో పనిచేస్తుంది గానీ మధ్యాహ్నం లంచ్ సమయానికి మాదగ్గరికి వస్తుంది. విమల నాతోకూడా మాట్లాడుతుందిగానీ కామేశ్వరరావుతో ఉన్నంత చనువుగా మాత్రం ఉండదు. అసలు నాతోనైనా నేను కామేశ్వరరావుకు స్నేహితుడిని గాబట్టి మాట్లాడుతుందేమో!!

ఇన్నాళ్ళూ కామేశ్వరరావూ విమలలు ఒకళ్ళ ఇళ్ళకు మరొకళ్ళు వెళ్ళడం, సినిమాలకూ, షికార్లకూ వెళ్ళడం జరుగుతూ ఉంది. కానీ ఈమధ్య వారికి అభిప్రాయభేదాలు వచ్చి

నట్లు నాకు అనుమానం పుట్టింది. నా అనుమానానికి సరియైన కారణం లేకపోలేదు. విమలా కామేశ్వరరావులు ఇదివరకట్లా కలుసుకోవడంలేదు. విమల కూడా లంచ్ సమయంలో మా సెక్షనుకు రావడంలేదు. ఒకవేళ ఎప్పుడైనా వచ్చినా ఆమె నాతోనే కాస్త మాట్లాడుతుంది. కామేశ్వరరావుతో ఏదో పొడి పొడిగా మాట్లాడుతుంది. వారిద్దరిమధ్యా రాను రాను మాటలు కూడా కరువైపోతుంటే నా అనుమానం దృఢమైంది. వారిద్దరి స్నేహం ఇలా దెబ్బతినడానికి అసలైన కారణం ఏమయి ఉంటుందో నా ఊహకు చిక్కడం లేదు. కొన్నాళ్ళు ఓపిక పట్టానుగానీ ఇక కుతూహలం అణచుకోలేక వాడినే అడిగేశాను అసలు విషయం ఏమిటని. అప్పుడు జరిగిన సంగతి ఇదని అంతా చెప్పుకొన్నాడు. అతను చెప్పిన విషయం నిజంగా నాకు చాల ఆశ్చర్యం కలిగించింది.

విమల తమ స్నేహాన్ని మరో విధంగా అర్థంచేసుకుని అపార్థం చేసుకుందనీ...కొన్నిరోజుల క్రితం తనదగ్గరికి వచ్చి తనను ప్రేమిస్తున్నట్టూ... పెళ్ళిచేసుకోమని అడిగినట్టూ... తను అందుకు నిరాకరించినట్టూ చెప్పాడు కామేశ్వరరావు.

విమలను వివాహం చేసుకోవడానికి కామేశ్వరరావు ఎందుకు నిరాకరించాడో నాకు అర్థంకాలేదు. విమలకంటే అందమైన, యోగ్యురాలైన అమ్మాయి అతనికి భార్యగా లభిస్తుందన్న నమ్మకం కూడా నాకు లేదు. అదే విషయం వాడితో అన్నాను.

"లేదోయ్...నువ్వు చాల పొరపాటు పడుతున్నావ్... నా మన స్తత్వానికి ఆమె మన స్తత్వానికి చాల తేడావుంది.

మా ఇద్దరి అభిప్రాయాలు ఏవీ కలవవు. మేమిద్దరం పెళ్ళిచేసుకుంటే అంతగా సుఖపడమని అనుకుంటాను. అందుచేతనే స్నేహాన్ని పెళ్ళితో ముడిపెట్టకని విమలతో చెప్పాను. కానీ ఆమెకు కోపంవచ్చి నా స్నేహాన్ని కూడా వదులుకుంది... పూర్ గర్ల్..." అన్నాడు కామేశ్వరరావు నిట్టూరుస్తూ.

విమలతో వివాహం యిష్టపడక పోవడానికి కామేశ్వరరావు చెప్పిన కారణం నాకు అంత సమర్థనీయంగా కనిపించలేదు. అంతేకాకుండా వాడు నా దగ్గర ఏదో దాస్తున్నాడన్న అనుమానం కూడా వచ్చింది. వాడు విమల గురించి మాట్లాడుతున్నప్పుడు వాడి ముఖం వివర్ణంకావడం, మాటలు తడబడడమే నేను వాడిని అనుమానించడానికి కారణమైనాయి.

కొన్నాళ్ళపాటు కామేశ్వరరావు విమలల గురించి నాలో అంతులేని ఆలోచనలు సాగాయి. కానీ కాలక్రమాన కొన్ని నెలల అనంతరం వాళ్ళ విషయం నా మనసులో మరుగున పడిపోయింది.

ఒకరోజు మా సెక్షనుకు శుభలేఖల కట్టపట్టుకుని వచ్చింది విమల. ఆమె వివాహం నిశ్చయం అయింది కామేశ్వరరావుకు నాకూ శుభలేఖలు ఇచ్చింది.

కామేశ్వరరావుకు శుభలేఖ ఇస్తున్నప్పుడు "నన్ను క్షమించు కామేశం" అని విమల నెమ్మదిగా అన్నది. ఆమె మాటలు నా చెవిని పడనే పడ్డాయి. కామేశ్వరరావు స్నేహభావాన్ని అపార్థం చేసుకున్నందుకు విమల ఇప్పుడు పశ్చాత్తాపపడుతుందని అనుకున్నాను.

కామేశ్వరరావు ఒకసారి నావైపుచూసి మళ్ళీ విమల వైపు తిరిగి "ఛ... ఛ... ఇందులో నీ తప్పేం ఉంది...నువ్వే నన్ను క్షమించు'' అన్నాడు తగ్గు స్థాయిలో.

విమల పెళ్ళికి కామేశ్వరరావు రాలేదు. నేను విమల పెళ్ళికి వెళ్ళబోతుంటే నా దగ్గరికి పరుగెత్తుకువచ్చి దంతంతో చేసిన ఒక తాజ్‌మహల్ బొమ్మను నా చేతిలో పెట్టి "ఇది విమలకు నా తరఫున ప్రెజెంటేషన్‌గా అందజెయ్యి... నాకు చాల ముఖ్యమైన పనొకటి తగిలింది... నేను పెళ్ళికి ఎటెండ్ అవడానికి కుదరదు... పెళ్ళికి రాలేకపోయినందుకు నన్ను క్షమించమని విమలతో చెప్పు" అని చెప్పి ఎలా వచ్చాడో అట్లానే పరుగులాంటి నడకతో వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

విమల పెళ్ళి అయిపోయింది!

పెళ్ళయిన తరువాత విమల ఉద్యోగానికి రాజీనామా చేసింది. రోజులు అలా గడిచిపోతున్నాయి.

ఆ ఆదివారం నేనూ, కామేశ్వరరావూ సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. నేను వాళ్ళింటికి వెళ్ళాను. "ఇప్పుడే బట్టలు మార్చుకుని వస్తానుండు" అంటూ నన్ను డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి లోపలికి వెళ్ళాడు కామేశ్వరరావు.

ఏమీ తోచక బల్లమీద ఉన్న నవలతీసి పేజీలు తిరగ

వెయ్యడం మొదలుబెట్టాను. నవల మధ్యనుండి ఒక శుభలేఖ క్రిందపడింది. వంగి దానిని తీసి మడతవిప్పిచూశాను.

అది విమల పెళ్ళి శుభలేఖ!!

మళ్ళీ దానిని మడిచి నవల మధ్య పెట్టబోతూ ఏదో అనుమానం వచ్చి శుభలేఖ విప్పిచూసి ఉలిక్కిపడ్డాను.

ఆ శుభలేఖలో వరుడి పేరుని కొట్టివేసి అక్కడ తన పేరు వ్రాసుకున్నాడు కామేశ్వరరావు !!! ...

మార్చి 1976 - యువ.